క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామర్రు: మండల పరిధిలోని కొత్త పెదమద్దాలి, కొండాయపాలెం గ్రామాలలో బుధవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ ఏఈ మోహనకృష్ణారావు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల మధ్య జాతీయ రహదారి పనులను బుధవారం నుంచి జరుగుతాయని తెలపారు. అందులో భాగంగా 11 కేవీ, ఎల్‌టీ లైన్లు మార్చేందుకు ఉదయం 9గంటల నుంచి సాయింత్రం 5గంటల వరకు కాంట్రాక్టు వర్కులు చేసేందుకు వీలుగా అవసరం మేరకు విద్యుత్ నిలుపుదల చేస్తామని చెప్పారు. పెదమద్దాలి, కొండాయపాలెం గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రులో రాయితీపై వరి విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ మాట్లాడుతూ విత్తనాల మొలక శాతాన్ని పరీక్షించుకోవడంతో పాటు విత్తన శుద్ధి విధిగా చేసుకోవాలని రైతులకు సూచించారు. విత్తన శుద్ధి వల్ల పైరు ప్రారంభ దశలో తెగుళ్ల పురుగుల బారి నుంచి కాపాడుకోవచ్చన్నారు. రాయితీపై ఎంటీయూ 1061 –1018 రకం వరి విత్తనాలు 30 కిలోల బస్తా రూ.1044కే అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా రాకేష్ కుమార్, స్థానిక ప్రముఖులు జగన్మోహన్‌రావు, వెంకటరమణ, ప్రసన్నకుమార్, ప్రసాద్, వరలక్ష్మి, పాల్గొన్నారు.

ఘనంగా కుంభారాధన



గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటి మీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామికి కుంభారాధన చేశారు. వార్షికోత్సవంలో భాగంగా లక్ష్మీనారాయణ యాగం చేసి 108 కళశాలతో స్వామికి పంచామృతాభిషేకం చేసినట్లు ఆలయ అర్చకుడు వేదాంతం అప్పలాచార్యులు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు స్వామి దివ్య తిరుక్కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు.

వీరాంజనేయుడికి విశేష పూజలు



పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో జేష్ఠ మాసం మంగళవారం పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి విశేషంగా ఆవు పాలతో, పంచామృతాలతో, నవ రసాలతో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం శత సహస్ర నామాలతో ప్రత్యేకంగా పూజలను, నాగవల్లీలతో, వడ మాలతో, పుష్పమాలలతో స్వామిని అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు వండి స్వామికి నివేదనలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. నూతన వాహనదారులు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్ : ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. జిల్లాలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని పుట్టలో పాలు పోసి అభిషేకాలు చేయించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. సుబ్బారాయుడికి 160కి పైగా అభిషేకాలు నిర్వహించారు. పలువురు దంపతులు తమ పిల్లలకు అన్నప్రాసనలు చేయించారు. తులాభారం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

ఆకుకూరలకు ప్రాధాన్యం

- మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో ఆసక్తి చూపుతున్న రైతులు
- పెరుగుతున్న కూరగాయల ధరలకు ప్రత్యామ్నాయంగా వినియోగదారులు ఆకు కూరలపై మొగ్గు



పునాదిపాడులో సాగులో ఉన్న వివిధ రకాల ఆకుకూరల మడులు

కంకిపాడు: ఆకుకూరల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. కూరగాయల సాగులో ఆకుకూరలకు రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మార్కెట్‌లో ఆకుకూరలకు డిమాండ్ ఉండటం ఓ కారణం కాగా, పెరుగుతున్న కూరగాయల ధరలకు ప్రత్యామ్నాయంగా ఆకుకూరలను వినియోగిస్తుండటం మరో కారణం.

పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో ప్రస్తుత సీజన్‌లో కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. కూరగాయలతో పాటుగా ఆకుకూరలను కూడా ప్రధానంగా సాగుకు ఎంపిక చేసుకుంటున్నారు. వీటిలో గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర వంటివి సాగు చేస్తున్నారు. చిన్న చిన్న కమతాల్లో ఆకుకూరలను పండిస్తున్నారు.

ఆకుకూరలకు భలే డిమాండ్..

కూరగాయల ధరలు గిరాకీగా ఉన్నాయి. కిలో టమాటా రూ. 50, మిర్చి రూ. 80, వంకాయ మినహా అన్ని కూరగాయలూ దాదాపుగా రూ. 20కి పైగానే పలుకుతున్నాయి. అడపా దడపా కురిసే వర్షాలకు కూరగాయల నాణ్యత దెబ్బతినడంతో పంట దిగుబడి తగ్గుతోంది. దీంతో డిమాండ్‌కు అనుగుణంగా పంట మార్కెట్‌కు రావడం లేదు. ఫలితంగా కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో వినియోగదారులు ఆకుకూరల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. రైతుబజారులో మూడు కట్టలు రూ. 10 పలుకుతుండగా, బయటి మార్కెట్‌లో రూ. 10కి రెండు కట్టలు అమ్ముడవుతున్నాయి. 40 రోజుల్లోనే పంట చేతికి రావడం, మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో రైతులు ఆకుకూరలను సాగు చేస్తున్నారు.



కంకిపాడులో సాగులో ఉన్న గోంగూర



కైకలూరులో నేరేడు పండ్ల విక్రయాలు



పోషకాల గని.. నేరేడు

కైకలూరు: మిలమిల మెరిసే నేరేడు పండ్లు నోట్లో వేసుకోగానే ఇట్టే కరిగిపోతాయి. వేసవి నెల తర్వాత వీటి సీజన్ మొదలవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో నేరేడు పండ్లను తోపుడు బండ్లపై విక్రయిస్తున్నారు. చిన్నసైజు పండ్లు అరకేజీ రూ.50 వంతున విక్రయిస్తున్నారు. వీటిలో అల్ల నేరేడు, చిట్టి నేరేడు రెండు రకాలు ఉంటాయి. అనేక పోషక గుణాలు కలిగిన వీటి శాస్త్రీయ నామం 'సైజీజియం క్యుమిని'. వీటిలో ఆక్సాలిక్ టాన్నిక్ ఆమ్లం, విటమిన్లు, క్రోమియం పుష్కలంగా ఉంటాయి. నేరేడు పండులో గ్లైకమిక్ ఇండెక్స్ అధికంగా ఉండటంతో మధుమేహ వ్యాధిని నియంత్రిస్తుంది. కాలేయం క్రమబద్ధీకరణ, జ్వర నివారణ, మూత్రంలో మంట, దంత సమస్యలు, బ్యాక్టీరియల్, వైరల్ ఇన్‌ఫెక్షన్ల నివారణతో పాటు అధిక రక్తపోటు, గుండె సమస్యలకు చక్కటి ఔషధంగా నేరేడు పండు పనిచేస్తుంది.

100 గ్రాముల నేరేడులో పోషకాలు గ్రాముల్లో..

తేమ 83.7 గ్రాములు, పిండి పదార్థం 19, మాంసకృత్తులు 1.3, కొవ్వు 0.1, ఖనిజాలు 0. 4, పీచు పదార్థం 0.9, క్యాల్షియం 15 – 30 మిల్లీ గ్రాములు, ఇనుము 0.4 మిల్లీ గ్రాము లు, సల్ఫర్ 13 మిల్లీ గ్రాములు, విటమిన్ సీ 18 గ్రాముల వంతున పోషక విలువలు ఉంటాయి. ఈ సీజన్‌లో మీరూ రుచి చూడండి.

జోరుగా పాఠశాలల్లో ప్రవేశాలు



ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. వేసవి సెలవుల అనంతరం 13న పాఠశాలలు తిరిగి ప్రారంభించినప్పటికీ వరుస సెలవుల నేపథ్యంలో మంగళవారం నుంచి ప్రవేశాలు జోరందుకున్నాయి. గ్రామాల్లో బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరుతున్నారు. పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నలుగురు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్టు ఉపాధ్యాయులు సీహెచ్ చక్రధర్, బేతాల రాజేంద్రప్రసాద్ తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



తాడంకి(పామర్రు): పమిడిముక్కల మండలం తాడంకి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మంగళవారం స్టూడెంట్ కిట్స్, నోట్ బుక్స్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో మెరుగైన విద్యాబోధనకు ఉపాధ్యాయులు తగు విధంగా సహకరించాలని అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయిస్తూ వారి అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం వైఎస్. ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తాడిశెట్టి నరేష్, గుడివాడ డీవైఈవో ఐ.పద్మ రాణి, తాడంకి, మంటాడ గ్రామాల సర్పంచ్‌లు జంపాన ధనలక్ష్మి, ఎం. వీరమ్మ, ఎంపీటీసీలు శ్రీలక్ష్మీ, ఎం రాజేశ్వరీ, ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్టు కృష్ణా జిల్లా సీఈవో రమేష్, నియోజకవర్గంలోని విద్యాశాఖ అధికారులు బి.శ్రీనివాసరావు, జి. జగన్‌మోహన్‌రావు, ఎస్.శ్రీనివాస్‌రావు, వి.సురేష్, బి. సురేష్, జి.పద్మవాణి, స్థానిక నాయకులు జక్క శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న పక్కా డ్రెయిన్లలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని ముంపు సమస్యను అధిగమించడానికి మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులు పూడికతీత పనులు చేపట్టారు. 45వ డివిజన్ బస్టాండ్ సెంటర్ ప్రాంతంలో ప్రస్తుతం పూడికతీత పనులు జరుగుతున్నాయి. బస్టాండ్ వైపు ఉన్న ప్రధాన డ్రెయిన్‌లో పెద్ద ఎత్తున పేరుకుపోయిన సిల్టును తొలగిస్తున్నారు. ఈ పనులను డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ పీవీ ఫణికుమార్, పారిశుద్ధ్య విభాగ అధికారులు పర్యవేక్షించారు.

జగనన్నకు తోడుగా నిలుద్దాం

కైకలూరు: కార్యకర్తలు, నాయకులందరూ జగనన్నకు తోడుగా నిలుద్దామని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గం నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు డీఎన్నార్‌ను మంగళవారం కలిశారు. భవిష్యత్తులో పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై చర్చించారు. నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికీ పార్టీని చూడకుండా సంక్షేమ పథకాలు అందించామని గుర్తుచేశారు. ప్రజల తీర్పుని గౌరవిస్తూనే క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు వెళదామన్నారు. త్వరలో అందరితో సమావేశాలు నిర్వహించి ప్రణాళికను రూపొందిద్దామని తెలిపారు.



పార్టీ కార్యాలయంలో నాయకులతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

డాక్టర్ బత్తిన విగ్రహం ఆవిష్కరణ

కైకలూరు : దివంగత డాక్టర్ బత్తిన నరసింహారావు (కాళ్లపాలెం డాక్టర్) మంచి డాక్టరుగా అందరి హృదయాల్లో నిలిచారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. వరహపట్నం శివారు బొల్లినంపాడు అగ్రహారంలో కాళ్లపాలెం డాక్టరు విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. పేదల డాక్టరుగా పేరుపొందిన ఆయన 2020లో మరణించారని తెలిపారు. పలువురు వ్యక్తులు మాట్లాడుతూ సేవా నిరతితో ఎందరో నిరుపేదల ప్రాణాలు కాపాడిన మహనీయుడు డాక్టర్ బత్తిన అని కొనియాడారు. అనంతరం వైద్య సేవలు చేస్తున్న కుటుంబ సభ్యులను సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పోసిన చెంచు రామారావు, టీడీపీ నాయకులు బొర్రా చలమయ్య, వీరమల్లు నరసింహారావు, పోసిన పాపారావు గౌడ్, పరసా ఏడుకొండలు, కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘ అధ్యక్షుడు పోలగాని నాగరాజు, మొడుగుమూడి లక్ష్మయ్య, నాయకులు త్రినాథరాజు, తాడినాడ బాబు, పూల రాజీ, కొల్లి బాబి, కట్టా నాగబాబు, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు మారగాని గణపతి, చిల్లి ముంత నాగేశ్వరరావు, పడమట సీతారామయ్య, రాగాని మద్ది రామయ్య, పడమటి చంద్రం, చిల్లి ముంత గణపతి, నాగరాజు, దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కాళ్లపాలెం డాక్టరు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కామినేని

చేపల చెరువుల మరమ్మతులను అడ్డుకోవద్దు

కైకలూరు: చేపల, రొయ్యల సాగు చెరువుల మరమ్మతులను రెవెన్యూ అధికారులు అడ్డుకోవద్దని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. తను మంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన ప్రత్యేక జీఓ నేటికీ అమలులో ఉందని, పక్క రైతు అభ్యంతరం పెడితే చెరువు సర్వే చేసి సమస్యను పరిష్కరిద్దామని తెలిపారు. స్థానిక సీతారామ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ స్థాయి అన్ని శాఖల అధికారులో ఆయన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరైన తన పేరు చెప్పి అధికారులను ఒత్తిడి చేస్తే తన కుటుంబ సభ్యులైనా సరే తప్పు చేస్తే ఉపక్షేంచవద్దని శ్రీనివాస్ అన్నారు. నేషనల్ హైవేలు, ప్రభుత్వ కార్యాలయ నిర్మాణాలకు ఇసుక తరలిస్తే అనుమతి పత్రాలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్య తాగునీటి కొరతని, కేంద్ర స్థాయిలో జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు నీరు అందిస్తానని చెప్పారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ అందించి ఆదుకుంటామన్నారు. ముదినేపల్లి మండలం వడాలిలో దేవస్థాన సమస్యను రెండు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పారు. కొల్లేరులో ప్రజల జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని ఫారెస్టు అధికారులు వ్యవహరించాలని కోరారు. కక్షసాధింపు చర్యలు ఉండవన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఇరిగేషన్ ఎస్‌ఈ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఈఈ జి.త్రినాథబాబు, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, గుడివాడ డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ పి.రామకృష్ణ, దేవాదాయశాఖ గుడివాడ ఇన్స్‌పెక్టర్ ఈ.సుధాకర్, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసియున్న శ్రీ రంగనాయకస్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో ఉదయం నిత్యబలిహరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి వధూవరాన్వేషణం(ఎదుర్కోలు) ఉత్సవాన్ని నాయుడు వేంకటరమణమూర్తి దంపతులతో వారి గృహం వద్ద నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఈఓ కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాలలో యాజ్ఞికస్వామి కాశీనాథుని పూర్ణరవీంద్ర బాపేశ్వరశర్మ బ్రహ్మత్వంలో పలు యజ్ఞాలు నిర్వహించి పూజలు చేశారు. సుహాసినిలు శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. రాత్రికి చింతామణి నాటకం నుంచి ప్రణయఘట్టం సీను భక్తులను ఆకట్టుకుంది. ఆర్గనైజర్ బి.నాగరాజు ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాలను ఈఓ బి.సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

పేద విద్యార్థులకు సాయం



విద్యార్థులకు నగదు బహుమతులను అందిస్తున్న సుశీలరావు

గుడ్లవల్లేరు: పేద విద్యార్థులు తాము ఉన్నత శిఖరాలకు చేరేందుకు సంపన్న వర్గాలు చేయూతను అందించాలని మాజీ డీఎస్పీ శాయన సుశీలరావు పిలుపునిచ్చారు. కొతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పి.మను బాలాజి టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలో తృతీయ స్థానం, మండల టాపర్‌గా నిలిచిన సందర్భంగా సుశీలరావు రూ.5 వేల నగదు బహుమతిని అందించారు. టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించిన మరొక ఐదుగురు విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేశారు. తమ తల్లిదండ్రులు శాయన వీరభద్రయ్య, వీర రాఘవమ్మ సేవా సమితి పేరిట ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



కైకలూరు ఉన్నత పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు/మండవల్లి/ముదినేపల్లి రూరల్: సమాజంలో ఎవరూ దొంగిలించలేనిది విద్య మాత్రమే అని, విద్యార్థులు లక్ష్యంతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆకాంక్షించారు. పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం సందర్భంగా నియోజకవర్గంలో కైకలూరు, ఆరుతెగళపాడు, మండవల్లి, ముదినేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ కుటుంబంలో అందరూ చదువుకుంటే భవిష్యత్తులో ఆర్థికంగా, సామాజికంగా ముందుంటారన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం నేను బడికి పోతా, దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరాల పోస్టర్లను విడుదల చేశారు. పలు పాఠశాలల్లో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహాం, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీలు అడవి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, జెడ్పీటీసీలు కుర్రేళ్ల బేబీ, బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ జహీర్, సర్పంచ్‌లు తలారి మణి, మెండా ఝాన్సీ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు త్రినాథరాజు, జోగిరాజు, మల్యాద్రి, వీరాబత్తిన సుధా, పాలవరపు రాణి, కీర్తి వెంకట రామప్రసాద్, బలే ఏసురాజు, కోటప్రోలు కృష్ణ, జానీ, బషీర్, కొడాలి వినోద్, వీరమల్లు నరసింహారావు, వల్లభనేని శ్రీనివాసచౌదరి, పూల రాజీ, కొల్లి బాబీ, కేవీఎస్ఎం నాయుడు, ఉస్మాన్, వీరంకి వెంకటేశ్వరరావు, చాపరాల దుర్గాప్రసాద్, తహసీల్దార్లు పోతురాజు, వంశీ, ఎంపీడీఓలు ఉమామహేశ్వరరావు, ఎంఈఓలు రామారావు, శ్రీనివాసరావు, భాస్కరరావు, నరేష్‌కుమార్, పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అనధికార ఫ్లెక్సీలు తొలగించాలని దీక్ష



నిరసన చేపట్టిన మురళీకృష్ణ

గుడివాడ టౌన్: పట్టణంలో రాజకీయ పార్టీల నాయకులు, ఇతరులు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న అనధికారిక ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని భవిష్యత్ భద్రతాదళం వ్యవస్థాపకులు వైవీ మురళీకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక మార్కెట్ సెంటర్ లోని మూడెడ్ల రామారావు చౌక్ వద్ద ఆయన నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని గతంలో అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టినా పట్టించుకోకపోవడంతో తాను హైకోర్టుకు వెళ్లి ఫ్లెక్సీలు తొలగించాల్సిందిగా ఆదేశాలు తెచ్చానన్నారు. దీనికి సంబంధించి సుప్రీం కోర్టు తీర్పులు సైతం జతచేసి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. ఫ్లెక్సీలు తొలగించకపోతే నిరసన వీడేది లేదని మురళీకృష్ణ భీష్మించడంతో వెంటనే తొలగింపు కార్యక్రమం చేపడతామని 24 గంటలలో పట్టణంలోని అన్ని అనధికారిక ఫ్లెక్సీలు తీసివేస్తామని మున్సిపల్ కమిషనర్ జి. బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. దీంతో మురళీకృష్ణ నిరసన విరమించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ప్రాకర్లలో చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న సర్పంచ్ రామలింగేశ్వరరావు



గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో కార్యకర్తలు, విద్యార్థులు



గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్‌లతో చిన్నారులు

ప్రాకర్ల(పామర్రు): ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు పామర్రు సెక్టారు పరిధిలోని ప్రాకర్ల గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. మన అంగన్‌వాడీ పిలుస్తోంది పక్షోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులతో ర్యాలీ చేసి అనంతరం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ గొంతుపులి రామలింగేశ్వరరావు పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ప్రాకర్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయన శివరామ ప్రసాద్, ప్రాకర్ల అంగన్‌వాడీ కార్యకర్త నత్తా సీతా మహాలక్ష్మి, నిమ్మకూరు–1 సెంటర్, ఎలకుర్రు సెంటర్ కార్యకర్తలు ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్ : కైకలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని సింగరాయపాలెం సెక్టారులో సింగరాయపాలెం–3, చేవూరుపాలెం కేంద్రాల్లో గ్రాడ్యూయేషన్ డే కార్యక్రమాలు మంగళవా రం ఘనంగా నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ ప్రసన్న గ్రాడ్యూయేషన్ డే ప్రాధాన్యతను వివరించారు. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, కార్యదర్శి గిరిజ, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.రిబ్కా, ఎం.భాగ్యలక్ష్మి, జి.లక్ష్మీభవాని, ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, ఎం.అరుణకుమారి పాల్గొన్నారు.

పెదపూడి(మొవ్వ): మూడు సంవత్సరాలు వచ్చిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయాలని పెదపూడి గ్రామ సర్పంచ్ తాతా రజిని పేర్కొన్నారు. మొవ్వ మండలం పెదపూడి సచివాలయ గ్రామ పరిధిలో యద్దనపూడి, పెదపూడి గ్రామల్లో ఐదు అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డేను పెదపూడి అంగన్‌వాడీ కేంద్రం–1లో మంగళవారం నిర్వహించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య గల ప్రీ స్కూల్ చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మానసిక ఎదుగుదలకు ఆటపాటలతో పాటు చదువుపై ఆసక్తి కలిగే విధంగా విద్యా బోధన నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఏఎస్ కల్యాణి, హెచ్‌ఎం పీ కరుణాకర్‌రెడ్డి, కార్యకర్తలు జి.పద్మజ, ఎం.జ్యోతి, సీహెచ్ నాగమణి, కే జ్యోతి లక్ష్మి, టి.వెంకటేశ్వరమ్మ, ఏఎస్ఎం కే బుజ్జి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ఉయ్యూరు: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు కృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని ధార్మిక భవన్‌లో సాత్విక్ యోగా శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పట్టణ వాసులు, విద్యార్థులు తరగతులకు హాజరై యోగాసనాలలో శిక్షణ పొందారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21వ తేదీ వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని యోగా గురువు కృష్ణ తెలిపారు. తరగతులను విశ్రాంత టెలికం ఉద్యోగి కేవైకే రెడ్డి పర్యవేక్షించారు.

నేడు హిందూ సామ్రాజ్య దినోత్సవం

కైకలూరు: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం కైకలూరు రామకృష్ణ సేవా సమితిలో బుధవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్టు కైకలూరు ఖండ కార్యవాహ పాములు తెలిపారు. హిందూ సామ్రాజ్యాన్ని చత్రపతి శివాజీ స్థాపించిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. హిందూ బంధువులు, స్వయం సేవకులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.